www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 31 ఆగస్టు 2023
5
తూర్పుగోదావరి



'బంగారు కొండ'పై పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బంగారు కొండ పథకంలో పోషకాహార లోపం గల పిల్లలను దత్తత తీసుకొని పౌష్టికాహారాన్ని అందిస్తున్న బాలమిత్రలు ప్రతి బుధవారం వారి వద్దకు వెళ్లి బాగోగులు చూడాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. కమిషనర్ దత్తత తీసుకొన్న గోరక్షణపేటకు చెందిన షేక్ ఫారూక్‌ను ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. తల్లితండ్రులతో పాటు పౌష్టికాహారానికి లోటు లేకుండా కిట్లలోని ఆహార పదార్థాలను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. అలాగే గోపాల్‌నగర్ పుంతలోని కొవ్వాడ దీక్షితను పరామర్శించారు.



చిన్నారితో కమిషనర్



సమరభేరిలో పాల్గొన్న సిపిఎం నాయకులు



సంతకాలు చేస్తున్న ప్రజలు


గ్యాస్ ధరల తగ్గింపు మోడీ ఎన్నికల జిమ్మిక్కు

'సిపిఎం సమరభేరి'లో జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజల నుంచి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వంటగ్యాస్ ధరల తగ్గింపు మోడీ ప్రభుత్వ ఎన్నికల జిమ్మిక్కులో భాగమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరభేరి పేరుతో సిపిఎం చేపట్టిన కార్యక్రమం బుధవారం శ్యామల సెంటర్, గోకవరం బస్టాండ్ వద్ద నిర్వహించారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా నాయకులు వివరించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. సమర భేరి కార్యక్రమంలో భాగంగా 4న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్లలో మోడీ ప్రభుత్వం ధరలు పెంచుకుంటూ సామాన్యుల బతుకులను భారం చేసిందన్నారు. జిఎస్‌టితో అన్ని ధరలు తగ్గుతాయని చేసిన ప్రచారాన్ని గుర్తు చేశారు. గడిచిన ఏడేళ్లలో ధరలు ఆకాశాన్నంటాయని వివరించారు. రష్యా నుంచి తక్కువ ధరకు పెట్రోల్ దిగుమతి చేసుకుని ప్రపంచలోకెల్లా ఇక్కడే అత్యధిక ధరలకు విక్రయించుకునేలా ఆయిల్ కంపెనీలకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఓ వైపు పెరుగుతున్న ధరలకు పెట్రోల్ ధరలు తోడవటంతో నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలొచ్చాయన్నారు. మోడీ అధికారంలోకొచ్చే నాటికి 14 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.400 మాత్రమేనని గుర్తు చేశారు. దశల వారీగా ధరలు పెంచుతూ రూ.1180కి చేర్చారని, సబ్సిడీ సొమ్ముకు సైతం మంగళం పలికారని అన్నారు. తాజా రూ.200 తగ్గించటం కంటితుడుపు చర్య అని తెలిపారు. అధికారంలోకి రాగానే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. గడిచిన తొమ్మిదేళ్లలో అయినా కోటి ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. రేల్వేలో 2 లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ శాఖల్లో 2 కోట్ల ఖాళీ పోస్టులు ఉన్నాయన్నారు. విద్యుత్ సంస్కరణలను చట్టం చేయడంతో సామాన్యులపై మరింత భారం పడుతోందన్నారు. మోడీ చట్టాలను రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేయడంతో నాలుగేళ్లలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలు, పన్నులు, ఛార్జీలపైనా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలే షాక్ ఇస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు బి. రాజులోవ, టి.తులసి, ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, ఐ.సుబ్రహ్మణ్యం, కార్మిక నాయకులు బి.రాము, ఎస్.వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడి మండలంలో నిరసన తెలుపుతున దస్తావేజు లేఖర్లు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ఫ్రైమ్ 2.0ను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి- యంత్రాంగం

రిజిస్ట్రేషన్లలో ఫ్రైమ్ 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖర్లు బుధవారం పెన్ డౌన్‌కు దిగారు. **కడియం** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖర్లు పెన్‌డౌన్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లేఖర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ లేఖర్ల వ్యవస్థ బ్రిటీష్ వారు 1867లో ఏర్పాటు చేశారన్నారు. నేటికీ ఇదే కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్ల వ్యవస్థ, దస్తావేజు స్వరూపము సర్వ నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 296 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దాదాపు మూడు లక్షల మంది లేఖర్లు, వారి సహాయకులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఫ్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల పూర్వం బ్రిటిష్ కాలం నాటి దస్తావేజు పోయి తెల్ల కాగితంపై దస్తావేజులు వస్తాఅన్నారు. ఫ్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల పల్లెల్లో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వెంటనే ఈ వ్యవస్థను రద్దు చేయలన్నారు. **సీతానగరం** సబ్ రిజిస్ట్రారు కార్యాలయ పరిధిలో దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు, సహాయకులు పెన్‌డౌన్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో ఫ్రైమ్ టు పాయింట్ జీరో వల్ల వృత్తి మనుగడ కోల్పోతుందన్నారు. వెంటనే దీన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లేఖర్లు కూచిమంచి రమణారావు, చింతలూరి రమేష్, మడిచర్ల సూర్యనారాయణమూర్తి, అడపా తిరుపతిరావు, కెవి.వెంకటసింగరాజు, స్టాంపు వెండర్లు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖర్లు పెన్‌డౌన్‌తో నిరసన వ్యక్తం చేశారు. సంఘ నాయకులు జి.రామకృష్ణ మాట్లాడుతూ నూతన విధానంతో దస్తావేజు లేఖర్లు కడుపు కొట్టరాదన్నారు. రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి, గోపాలపురం మండలాలకు చెందిన లేఖర్లు రవి, శ్రీనివాస్, సత్యనారాయణ, గణేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటర మణమూర్తి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న లేఖర్లు

ఓటర్ల డేటా ఎంట్రీ పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆగస్ట్ 31 నాటికి ఇంటింటా సర్వే ద్వారా ఓటర్ల చేర్పులు, తొలగింపులకు చెందిన పూర్తి డేటా ఎంట్రీ పూర్తి చేయాలని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి ఎన్.తేజ్‌భరత్ స్పష్టం చేశారు. బుధవారం ఇన్నిస్‌పేటలోని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని 152 పోలింగ్ కేంద్రం పరిధిలో నూతనంగా నమోదు చేసిన, తొలగించిన ఓటర్ వివరాలను క్షేత్ర స్థాయిలో ఆయన తనిఖీ చేశారు. పలువురు ఓటర్లను, వారి కుటుంబ సభ్యుల నుంచి జాబితా ఆధారంగా చేర్పులు, తొలగింపు వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. మృతుల తొలగింపు, చిరునామా మార్పులు, 80 ప్లస్ ఓటర్లు గుర్తింపు, యువ ఓటర్లు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తనిఖీలో భాగంగా సీనియర్ సిటిజన్ 82 ఏళ్ల కోట సత్యవతి ఓటు నమోదును పరిశీలించారు. ఇప్పటికే ఆగస్ట్ 25తో ఇంటింటా సర్వే పూర్తి అయ్యిందన్నారు. పెండింగ్ పనులు ఏడు రోజుల్లో డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు పేరును ఫారం 8 ద్వారా తొలగించే క్రమంలో ప్రోటోకాల్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. సరైన ఆధారాలు, పంచనామా, ధవీకరణ పత్రాలు లేకుండా తొలగించరాదని స్పష్టం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ పి.చిన్నారావు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.కృష్ణసుధీర్; బిఎల్ఓ బివిఎన్.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న జెసి తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

యువగళం పాదయాత్రపై సమావేశం

ప్రజాశక్తి-నల్లజర్ల

సెప్టెంబర్ 1న నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల మండలంలోని ప్రవేశిస్తున్న నేపథ్యంలో టిడిపి నాయకులు బుధవారం సమావేశమయ్యారు. కౌలూరు గ్రామంలోని బేతిన సత్యనారాయణ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన మండల నాయకుల సమావేశంలో టిడిపి నియోజకరవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 1న యువగళం పాదయాత్ర పోతవారం గ్రామంలో ప్రారంభమవుతుందన్నారు. కవులూరు, చీపురుగూడెం నల్లజర్ల మీదుగా ప్రకాష్‌రావుపాలెం, ఆవుపాడు, సింగరాజుపాలెంలో కొనసాగి ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చేరుకుంటుందన్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కలిసి రావాలన్నారు. యువగళం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, మాజీ మండల అధ్యకులు జమ్ముల సతీష్, నాయకులు యలమాటి శ్రీనివాసరావు, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీల ఏజెంట్లు సమావేశాలకు హాజరు కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజకీయ పార్టీల ఏజెంట్లు ప్రతి గురువారం జిల్లా స్థాయి సమావేశాలకు హాజరు కావాలని డిఆర్ఒ నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,559 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి.ప్యాడ్స్‌ను తనిఖీ చేసేందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు వస్తుందన్నారు. సహేతుక కలిగిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఇంటింటికీ బిఎల్‌ఓలు వెళ్లి ఓటర్లను గుర్తిస్తున్నట్లు తెలిపారు. అదే క్రమంలో భౌతికంగా తీసుకున్న దరఖాస్తుల డేటా ఎంట్రీ పనులను కూడా సమాంతరంగా చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి బెల్ టెక్నికల్ బృందం పర్యటిస్తుందన్నారు. జిల్లాకు కేటాయించిన 6వేల బ్యాలెట్ యూనిట్స్, 4,930 వివి ప్యాడ్స్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి, వాటి పని తీరును నిర్ధారణ చేస్తారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రోజూ సిఇఒ వెబ్‌సైట్‌లో నియోజక వర్గాల వారీగా వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాను అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ నరసింహులు

పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.నందకిషోర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుతరాజు, సీనియర్ శాస్త్రవేత్త, విస్తరణ విభాగం అధికారులు బుధవారం మండలంలోని తాడిపర్రు, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను గ్రామాల్లో వరి పొలాలను సందర్శించారు. వరికి ఆశించే తెగుళ్లపై రైతులకు పలు సూచనలు చేశారు. వరి పైరు ప్రస్తుతం పిలకలు పూర్తిచేసుకుని, చిరుపొట్టు దశకు వెళ్లడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ దశలో ఎండాకు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు ప్లాంటోమైసిన్ ఒక గ్రాము, కొసైడ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి పది రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే నివారణకు క్లోరంట్రా నిలిప్రోలు మూడు మిల్లీలీటర్లు పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఆకు నల్లి ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు ప్రోఫోనోపాస్ రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎం.విశ్వాసరావు, ఎంపిఇఒ ఐ.నాగమణి, విహెచ్‌ఎ ఎస్.జగదీశ్వరి పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నడిపల్లిలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - పెరవలి

కానూరు పిహెచ్‌సి పరిధిలోని నడిపల్లిలో బుధవారం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బిపి, మధుమేహం, గర్భిణులు, బాలింతలు, సాధారణ రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 246 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలింతల ఇంటికి వెళ్లి పరీక్షించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు కె.హేమరాజు, సర్పంచ్ బీర సత్యవేణి, పిహెచ్‌సి సూపర్‌వైజర్స్ జి.సత్యేంద్రకుమార్, కెవి.నాగేశ్వరరావు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్స్, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రులో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకష్ణుని ఆలయం బుధవారం ప్రారంభమైంది. సంఘ అధ్యక్షుడు మట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షలతో దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, సంఘ కార్యవర్గ సభ్యులు వంతపాటి కృష్ణమూర్తి, వి.సుబ్బారావు, వి.గోవిందు, గాలి శ్రీను, నాగళ్ల శ్రీను, పాశం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సర్రాజు చిత్రపటం ఆవిష్కరణలో పాల్గొన్న గ్రామ పెద్దలు, ముఖ్యఅతిథులు

సర్రాజు చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి- పెరవలి

మండలంలోని తీపర్రులో గ్రంథాలయ వ్యవస్థాపకులు ప్రత్తిపాటి సర్రాజు చిత్రపటాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆయన 1968లో యువజన సంఘం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం శాఖా గ్రంథాలయంగా మారేందుకు కృషి చేశారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం సింహాద్రి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా భోగవెల్లి వెంకటసత్యనారాయణ, భోగవల్లి చినవెంకటసత్యనారాయణ, రమణయ్య, సర్రాజు కుటుంబ సభ్యులు వీరభద్ర కుమార్, ప్రసాద్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

జగన్‌కు స్వాగతం పలికిన గిరజాల

ప్రజాశక్తి-కడియం

జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ఇర్రిపాకకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద వైసిపి రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు గిరజాల బాబు స్వాగతం పలికారు. సిఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. గిరజాలతో పాటు పార్టీ నాయకులు పున్నమిరాజు వీర్రాజు ఉన్నారు.

కాలేజీకి నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కనీసం మౌలిక వసతులకు నిధులు మంజూరుకు చేయకపోవడం దురదష్టకరమని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్‌ఎఫ్ మండల నిర్మాణ మహాసభ ఎస్కే మునీర్ భాష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడారు. 2018లో గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఏర్పాటు చేసినప్పటికీ కళాశాలకు సొంత తరగతి గదుల ఊసే లేదన్నారు. తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీసం తాగునీటి సదుపాయాలు, బాలికలకు మరుగుదొడ్ల కూడా లేని పరిస్థితి దాపురించిందన్నారు. అనంతరం ఎఐఎస్‌ఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు.

నెహ్రూకు పాత్రికేయుల పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను బుధవారం ఆయన స్వగ్రామమైన ఇర్రిపాకలో గోకవరం మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. నెహ్రూ సోదరి తోట నాగలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు దీంతో నెహ్రూని ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మద్దాల బ్రదర్స్, కరాసు శివరామకృష్ణ, ఎం.ఆనంద్, ఎం.పాండురాజు, కె.రాజు, కె.రాజశేఖర్, ఎం.జయరాజు, పి.శ్యామ్ తదితరులున్నారు.

వెంకటప్రసాద్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

పోలీసుల చిత్రహింసలకు గురైన బాధితుడు వడ్డి వెంకట్‌ప్రసాద్ కుటుంబాన్ని ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు పరామర్శించారని ప్రజాస్వామ్యవాది బొంతా శ్యామ్‌రవిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి నాయకులు ఖండవల్లి లక్ష్మి మాట్లాడారు. దళిత యువకుడిని చిత్రహింసలకు గురిచేసిన కడియం ఎస్ఐని సస్పెండ్ చేయాలని, అతనిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రసాద్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



ఘనంగా రాఖీ పండుగ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల బుధవారమే రాఖీ పండుగను నిర్వహించుకున్నారు. రాజమహేంద్రవరంలో కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పులుగుర్త దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రాఖీ పండుగను నిర్వమించారు. సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమను చాటి చెప్పేదే రాఖీ పండుగ అన్నారు. విద్యార్థులకు సంప్రదాయ విలువలను నేర్పేందుకు ఇలాంటి పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిపూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న హోం మంత్రి తానేటి వనిత

హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో...

కొవ్వూరు రూరల్ : కొవ్వూరులోని హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాఖీ వేడుకలను నర్విహించారు. నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మాజీ ప్రజాప్రతినిధులకు ఆమె రాఖీలు కట్టారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో సిఎం జగన్‌కు రెడ్డికి హోంమంత్రి తానేటి వనిత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సిఎంకు రాఖీ కట్టిన మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత

బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాకకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, హోం మంత్రి తానేటి వనిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రాఖీలు కట్టారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్‌లో రాఖీల సందడి

ఉండ్రాజవరం, పెరవలి: రాఖీ పండుగ నేపథ్యంలో మండలంలో మార్కెట్‌లు రాఖీలతో సందడిగా మారాయి. రాఖీల అమ్మకాలు ముమ్మరంగా సాగాయి. రూ.10 మొదలుకుని రూ.150 వరకూ విలువ చేసే రాఖీలను గ్రామాల్లో విక్రయించామని వ్యాపారులు తెలిపారు. పెరవలి మండలంలో రాఖీల వ్యాపారం మందగించింది. గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది వ్యాపారం తక్కువగా ఉందని అక్కడి వ్యాపారులు తెలిపారు.



జగన్‌కు రాఖీ కట్టి బొకే ఇస్తున్న కలెక్టర్‌మాధవీలత

నేరాలు ఘోరాలు

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-చాగల్లు

మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సోమవారం రాత్రి మతి చెందినట్లు చాగల్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఎం.గంగమ్మ (60) ఈ నెల 25న బంధువుతో కలిసి నిడదవోలు దేవాలయానికి వెళ్లారు. చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామానికి వచ్చేసరికి వెనక కూర్చున్న గంగమ్మకింద పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గంగమ్మ మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.కె.హుస్సేన్ తెలిపారు.



వంతెన వద్ద మాట్లాడుతున్న హక్కుల సంఘం నాయకులు

పిఠాపురం-సామర్లకోట రోడ్డును నిర్మించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాలుగేళ్లుగా పూర్తిగా శిథిలమై రాకపోకలకు అవకాశం లేకుండా ఉన్న సామర్లకోట -పిఠాపురం రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సామర్లకోట పిఠాపురం రోడ్డులో గత 4 సంవత్సరాల క్రితం కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేసినందుకు అభినందనలు తెలుపుతున్నామని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా రక్షణ గోడ నిర్మాణం చేపట్టక పోవడం, అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని దీనిపై జిల్లా కలెక్టర్‌కు, ఆర్ అండ్ బి మంత్రికి విన్నవించగా వారు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేశారన్నారు. సామర్లకోట పిఠాపురం మధ్య త్వరలో ఆర్‌టిసి బస్సులు నడిపేందుకు త్వరలో చర్యలు తీసుకొనున్నట్లు ఆర్‌టిసి ఉన్నతాధికారులు ప్రకటించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. సత్వరమే రోడ్డు పనులు చేపట్టి, ఆర్‌టిసి బస్సుల రాకపోకలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు, ఎం.డీ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు ఇటీవల పున:ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 1200 మీటర్ల మేర ఒకవైపు రోడ్డు శుభ్రపరిచినట్లు రోడ్డు భవనాల శాఖ ఎఇ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. గురువారం నుంచి రోడ్డు బాగా దిగబడిన ప్రాంతాల్లో 4 అంగుళాలతో మొదటి లేయర్ వేసి తదనంతరం త్వరితగతన రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు.



ముఖ్యమంత్రికి రాఖీ కడుతున్న ఎంపీ చింతా అనురాధ

సిఎం జగన్‌కు రాఖీ కట్టిన అమలాపురం ఎంపీ

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాఖీపౌర్ణమి సందర్భంగా అమలాపురం ఎంపీ చింతా అనురాధ రాఖీ కట్టారు. బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనేందుకు సిఎం జగన్ వచ్చారు. ఈసందర్భంగా సిఎం జగన్‌కు హెలిప్యాడ్ వద్ద అమలాపురం ఎంపీ అనురాధ రాఖీ కట్టారు.



జెసిబి

నిరుపయోగంగా జెసిబి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మున్సిపాలిటీలో జెసిబి చెత్త ఎత్తుతుంది. అయితే దీనిని నెల రోజులుగా మూలన పెట్టేశారు. ఇది రోడ్డు పై ఉండే చెత్తను నిరంతరం ఎత్తివేస్తుంది. మరమ్మతుల పేరిట భారీగా ఖర్చు చేశారు. అధికారులు ఏమనుకున్నారో తెలియదు గాని రూ.లక్షలాది విలువ చేసే ఈ వాహనాన్ని పక్కన పెట్టేశారు. జెసిబి నిరుపయోగంగా ఉండటంతో మున్సిపాలిటీలో ఎక్కడకక్కడ మూలల్లో చెత్త దర్శనమిస్తోంది.


'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-కోటనందూరు, గండేపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. బుధవారం తుని రూరల్ డి.పోలవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన దక్షత గల నాయకుడు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. అప్పులు ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే టిడిపికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డి.పోలవరం సర్పంచ్ డాక్టర్ పలక సోమేశ్వరరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పోల్నాటి శేషగిరి, మోటుకూరు వెంకటేష్, సొర్ల లోవరాజు, ఇ.సత్యనారాయణ, వంగలపూడి బుజ్జి పాల్గొన్నారు.



తునిలో..



గండేపల్లిలో..

గండేపల్లి మండలం మల్లేపల్లిలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మహాశక్తి చైతన్య రథయాత్ర కమిటీ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టోను వివరివంచారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, పోసిన ప్రసాద్, దిడ్డి శ్రీను, కాటేపల్లి భద్రరావు, చింతపల్లి భద్రరావు, తెలగ రెడ్డి ప్రకాష్, కొల్లు త్రిమూర్తులు, తెలగ రెడ్డి వీరభద్రరావు, తిప్పన సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, నక్కిరెడ్డి సూర్యవతి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జి.మామిడాడ మండల సాధన కోసం ర్యాలీ

ప్రజాశక్తి-పెదపూడి

గొల్లలమామిడాడ గ్రామాన్ని ప్రత్యేక మండలంగా విభజించాలని పలు పార్టీలతో కలిసి ప్రజలు బుధవారం ర్యాలీ, మానవహారం చేపట్టారు. గొల్లలమామిడాడ, పైన, రాజుపాలెం, గంగ్రేడు, చింతపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, అఖిలపక్షం వైసిపి, తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులంతా కలిసి ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. పెదపూడి మండలాన్ని రెండుగా విభజించి తొమ్మిది గ్రామాలను పెదపూడి మండలంగా తొమ్మిది గ్రామాలను గొల్లలమామిడాడ మండలంగా విడదీయాలంటూ గొల్లలమామిడాడ జీఆర్ఎస్ఎ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ నుంచి మామిడాడ గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ పెదపూడి మండలం నుంచి తొమ్మిది గ్రామాలను విడదీసి గొల్లల మామిడాడ మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసి కోర్టులు చుట్టూ తిరిగారన్నారు. ఒక కోర్టులో నెగ్గితే మరో కోర్టులో అడ్డుకునేవారని చెప్పారు. గొల్లలమామిడాడ మండలంపై ఎవరూ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని కోరారు.



పెద్దాపురంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు

ప్రభుత్వాసుపత్రుల్లో క్యాంటీన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఏలేశ్వరం, పెద్దాపురం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి ఆహా క్యాంటీన్ మంజూరైనట్టు నగర పంచాయతీ కమిషనర్ కెవి.కొండలరావు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే ఈ క్యాంటీన్‌ను గురువారం కాకినాడ ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ క్యాంటీన్ ద్వారా రోగులు, వారి బంధువులకు నాణ్యమైన ఆహారం అందిస్తామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రోత్సాహంతో శ్రీలక్ష్మి స్వయం సహాయక సంఘం సభ్యులు ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తారని మెప్మా సిఒలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వారి బంధువులకు తక్కువ ధరలకు ఈ క్యాంటీన్ ద్వారా ఆహార పదార్థాలను సరఫరా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు విడదాసరి రాజా, కట్టా రాజబాబు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, మెప్మా సిఒలు శ్రీదేవి, ఉమాపార్వతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పంచారామ క్షేత్రం కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి చెన్నైకు చెందిన ఎర్రబోలు సత్య జగన్నాథరావు, విజయ దంపతులు రూ.2 లక్షలు విరాళంను బుధవారం ఆలయ ఇఒ డి.నాగమల్లేశ్వరరావుకు అందచేశారు. ఆలయ నంది మండపంలో ఇఒకు దంపతులు చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆధ్వర్యంలో ఆలయ పండితులతో దాత దంపతులకు ఆశీర్వచనాలు అందచేసి, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటంను అందచేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురానికి చెందిన కర్రి వెంకటరాజు, ఆలయ అర్చకుడు సన్నిధిరాజు వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలలుగా కోటిపల్లి రేవులో నిలిచిన ప్రయాణాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

జూలై నెలలో గోదావరికి వచ్చిన వరదలు కారణంగా కోటిపల్లి గోదావరి మూతపడింది. అమలాపురం తదితర కోనసీమ ప్రాంతాల నుంచి ద్రాక్షారామ కాకినాడ వెళ్లే ప్రయాణికులంతా ఈ రేవును ఉపయోగిస్తారు. కోనసీమ ముక్తేశ్వరం నుంచి పశువుల వ్యాపారులు సైతం కోటిపల్లి రేవునే ఉపయోగిస్తారు. దీంతో దగ్గర దారి కావడంతో కోటిపల్లి రేవు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. వరదల కారణంగా మూసిన రేవును రెండు నెలలైనా తెరవకపోవడంతో ప్రయాణికులు అమలాపురం యానం మీదగా చుట్టు తిరిగి రావాల్సి వస్తుంది లేదా రావులపాలెం నుంచి మండపేట మీదగా ద్రాక్షారామ కాకినాడ చేరుకోవాల్సి వస్తుంది. రేవును వెంటనే పునరుద్ధరించి ప్రయాణాలు కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.



కోటిపల్లి రేవు

అయిదు నెలలైనా జరగని వేలం

కోటిపల్లి రేవుకు ప్రతి ఏట మార్చిలో మండల పరిషత్తు బహిరంగ వేలం నిర్వహిస్తుంది. ఈ ఏడాది అయిదు నెలలు గడిచినా వేలం జరగకపోవడం విశేషం. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో గల కోటిపల్లి రేవుకు మే నెలలో వేలం నిర్వహించిన ఆశించిన స్థాయిలో టెండర్లు దక్కలేదు దీంతోపాటు ఆయుదావేశారు. పాటకు ఎవరూ ముందుకు రాక పోవడంతో మళ్లీ బహిరంగ వేలం నిర్వహిస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటికీ అమలు కాలేదు.

ఎంపిడిఒ వివరణ

కోటిపల్లి రేవు ఐదు నెలలుగా బహిరంగ వేలం నిర్వహించకపోవడంతో కె.గంగవరం మండల పరిషత్ అధికారి ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాము ప్రభుత్వ అధికారులకు రెండవసారి బహిరంగ వేలం నిర్వహించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సెప్టెంబర్ లో అనుమతులు వచ్చిన వెంటనే తిరిగి బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం రేవును వెంటనే పునరుద్ధరించి ప్రయాణాలు కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

కిడ్నీ బాధితునికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి-అమలాపురం

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి వికలాంగుల సంక్షేమ సంఘం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్నారై గ్రూప్ బుధవారం రూ.10వేల సాయం అందజేశారు. వివరాలు ఇవి.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నరసాపురానికి చెందిన సురేంద్ర అమలాపురంకిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వికలాంగుల సంక్షేమ సంఘం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్నారై గ్రూప్ బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని, రూ.10వేల సహాయం కిమ్స్ ఆస్పత్రి వద్ద బాధితునికి అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఒంటెద్దు వెంకన్న నాయుడు రూ.4 వేలు ఆర్థిక సహాయం పినిపే గ్రంధి ఫాలోవర్స్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూపు వ్యవస్థాపకులు మోకా సువర్ణరాజు రూ.6వేలు ఆర్థిక సహాయం మొత్తం రూ.10వేలు కిడ్నీ బాధితుడికి అందజేశారు. ఆర్థికసాయాన్ని వడ్డీల సంఘం గౌరవాధ్యక్షులు నగబేరి కష్ణమూర్తి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగులసంక్షేమ సంఘం అధ్యక్షులు నాగవరపు పరుశురాముడు చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాడి నాగరాజు, పెనుమాల నాగరాజు, బొంతు శ్రీనివాసు, నిమ్మకాయల సురేశ్, సాధనాల విఘ్నేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

'వూటుకూరి'కి ఘన సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు, రాష్ట్ర వీవర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రమణ్య స్వామిని పుల్లేటికుర్రు దేవాంగ ప్రముఖులు బుధవారం సత్కరించారు. ఈలో కారుపర్తి నాగమల్లేశ్వరరావు సిద్ధాంతి, దైవపు నందయ్య, బల్ల పుల్లేశ్వరరావు, మావూరి వీరవెంకటసత్యన్నారాయణ, బల్ల వెంకటసుబ్బారావు, పిచ్చిక విశ్వేశ్వరరావు, గుంటూ ఫణి ప్రసాద్, పిచ్చిక శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వూటుకూరి సుబ్రమణ్య స్వామిని సత్కరిస్తున్న పెద్దలు

అమ్మవారికి బంగారం, వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

అంగరలో కొలువై ఉన్న కమ్మవారి మధ్యాహ్నపు అమ్మవారికి బుధవారం బంగారం, వెండి, ఆభరణాలు దాతలు బహూకరించారు. కాకినాడకు చెందిన వోగిరాల వెంకటేశ్వరరావు,వెంకట లక్ష్మీ మహేశ్వరి దంపతులు 10 గ్రాముల బంగారు త్రినేత్రం, బొట్టు, కేజీ 10 గ్రాముల వెండితో అమ్మవారి చేతి హస్తం, కుంకుమ భరిణి, మొత్తం రూ.లక్షా70వేలు విలువగల ఆభరణాలను అమ్మవారి ఆలయంలో అందజేసినట్లు వారు తెలిపారు.

యానాం వార్తలు



కృష్ణభగవాన్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ అశోక్

సూర్యభగవాన్ కు నివాళులు

ప్రజాశక్తి -యానాం

విశాఖజిల్లా అనకాపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన దొమ్మేటిపేటకు చెందిన దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ మృతదేహానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఘనంగా నివాళు లర్పించారు. బుధవారం ఆయన దొమ్మేటిపేట భగవానం ఇంటికి వెళ్లి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. కృష్ణభగవాన్ భౌతికదేహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.



కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ఉపకరణాల పంపిణీకి వికలాంగుల గుర్తింపు

ప్రజాశక్తి - యానాం

కోల్కతాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకోమోటార్ డిజెబిలిటీస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని వికలాంగులకు సహాయపరికరాల పంపిణీ కోసం బుధవారం గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లంకే ప్రసన్న మాట్లాడుతూ వికలాంగులకు అవసరమైన సహాయపరికరాలను భారతప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ సహకారంతో ట్రైసైకిల్స్, వీల్‌ఛైర్స్ అంది స్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, డాక్టర్ గంగాధ రరావు, అమర్ బిస్వాస్, దీపి మిశ్రా ఉన్నారు.